
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ 5
జిల్లాల వార్తలు
ఆదివారం 17 మార్చి 2024




రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం సా : 6.32 గం.
సహర్ : సోమవారం ఉ: 5.00 గం.

కోడ్ కూసింది

లోక్‌సభ ఎన్నికలకు మోగిన నగారా

షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

- రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రచారం బంద్
- ఎంపీ అభ్యర్థి ప్రచార ఖర్చు పరిమితి రూ.95 లక్షలు
- ప్రభుత్వ ప్రచార పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రకియ షురూ
- మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేసింది. ఎన్నికల షెడ్యూలును శనివారం ప్రకటించగా తక్షణమే కోడ్ అమలులోకి వస్తుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్‌కు ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నది. ఆరోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ మొదలు కానున్నది. ఏప్రిల్ 25న నామినేషన్ల స్వీకరణ ముగియనున్నది. 26న పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు గడువుగా నిర్ణయించింది. మే 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనున్నది.

ప్రచార పరిమితి రూ.95 లక్షలు

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచార ఖర్చుగా రూ.95 లక్షలను ఎన్నికల సంఘం పరిమితి విధించింది. ఇందుకు సంబంధించి అభ్యర్థులు చేసే ప్రచార ఖర్చులను ఎప్పటికప్పుడు ఎన్నికల పరిశీలకులు, వ్యయపరిశీలకులు పరిశీలించనున్నారు. వీరితో పాటు ఎన్నికల సంఘం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ తదితర బృందాలు పరిశీలించనున్నాయి. అభ్యర్థుల ప్రచార ఖర్చును ఎన్నికల సంఘం నియమించిన వ్యయబృందాలతో ఆడిట్ చేయించుకోవాల్సి ఉంటుంది.

గుర్తింపు కార్డుతోనే ఓటు

ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 12 రకాల గుర్తింపు కార్డులను ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. ఇందులో ఏదో ఒక కార్డును చూపించి ఓటర్లు ఓటేయాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డుల్లో ఆధార్, ఉపాధిహామీ జాబ్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, ఫోటోతో ఉన్న పెన్షన్ కార్డు, బ్యాంకు, పోస్టాఫీసు పాస్‌బుక్ తదితర కార్డులను ఎన్నికల సంఘం అనుమతించింది.

జహీరాబాద్ ప్రధాన అభ్యర్థులు ఖరారు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే ప్రధాన అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కాగా మెదక్‌లో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇంకా ప్రకటించలేదు. బీజేపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు బరిలో నిలిచారు. జహీరాబాద్‌లో బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్ పోటీపడుతున్నారు.

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్లు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నారాయణఖేడ్	1,18,410	1,17,958	9	2,36,377
అందోలు	1,22,296	1,27,785	5	2,50,086
జహీరాబాద్	1,37,054	1,37,140	2	2,74,196
జుక్కల్	99,230	1,02,991	9	2,02,230
ఎల్లారెడ్డి	1,06,550	1,15,708	2	2,22,260
కామారెడ్డి	1,21,980	1,31,882	19	2,53,881
బాన్సువాడ	93,368	1,02,631	13	1,96,012
మొత్తం	7,98,888	8,36,095	59	16,35,042

జహీరాబాద్ ఆర్వోగా సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి నియమితులయ్యారు. అడిషనల్ రిటర్నింగ్ అధికారులుగా సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్లు బి.చంద్రశేఖర్, ఆర్డీ మాధురిని ఎన్నికల సంఘం నియమించింది. ఈ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కూడా ఎన్నికల సంఘం నియామకం చేసింది. జహీరాబాద్ సెగ్మెంట్‌కు సంగారెడ్డి రెవెన్యూ అధికారి జి.పద్మజారాణి, జుక్కల్‌కు కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడకు ఆర్డీవో రమేశ్‌రాథోడ్, ఎల్లారెడ్డికి ఆర్డీవో ఎం.ప్రభాకర్, కామారెడ్డికి ఆర్డీవో వై.రంగనాథ్‌రావు, నారాయణఖేడ్‌కు ఆర్డీవో అశోక్‌చక్రవర్తి, అందోలుకు ఆర్డీవో పాండు, జహీరాబాద్‌కు ఆర్డీవో రాజు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు.

మెదక్ ఆర్వోగా కలెక్టర్ రాహుల్

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ వ్యవహరించనున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఆర్డీవోలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. దుబ్బాక సెగ్మెంట్‌కు సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, పటాన్‌చెరుకు సంగారెడ్డి జిల్లా మైనారిటీ అధికారి ఏఆర్వోగా వ్యవహరిస్తారు. మిగిలిన సెగ్మెంట్లకు ఆర్డీవోలు ఏఆర్వోలుగా పనిచేస్తారు.

మెదక్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్లు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిద్దిపేట	1,16,042	1,20,361	71	2,36,474
మెదక్	1,03,654	1,13,089	5	2,16,748
నర్సాపూర్	1,09,806	1,16,342	6	2,26,154
సంగారెడ్డి	1,22,021	1,25,284	33	2,47,338
పటాన్‌చెరువు	1,97,557	2,09,757	85	4,07,419
దుబ్బాక	96,867	1,02,369	0	1,99,236
గజ్వేల్	1,37,630	1,41,854	5	2,79,489
మొత్తం	8,95,777	9,16,876	205	16,35,042

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో 1,971 పోలింగ్ కేంద్రాలు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 1,971 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో సాధారణ పోలింగ్ కేంద్రాలు 1,600, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 371 ఉన్నాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా పోలింగ్ కేంద్రాలు నారాయణఖేడ్‌లో 296, అందోలులో 313, జహీరాబాద్‌లో 313, జుక్కల్‌లో 255, ఎల్లారెడ్డిలో 270, కామారెడ్డిలో 266, బాన్సువాడలో 258 ఉన్నాయి.

మెదక్ లోక్‌సభ పరిధిలో 2,098 పోలింగ్ కేంద్రాలు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 2,098 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సెగ్మెంట్‌ల వారీగా సిద్దిపేటలో 273, మెదక్‌లో 274, నర్సాపూర్‌లో 305, సంగారెడ్డిలో 281, పటాన్‌చెరువులో 391, దుబ్బాకలో 253, గజ్వేల్‌లో 321 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



సంగారెడ్డి కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద ప్రభుత్వ ప్రచార ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటర్లు

మొత్తం ఓటర్లు	16,35,042
పురుషులు	7,98,888
మహిళలు	8,36,095
ఇతరులు	59

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటర్లు

మొత్తం ఓటర్లు	18,12,858
పురుషులు	8,95,777
మహిళలు	9,16,876
ఇతరులు	205



సంగారెడ్డి చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగేస్తున్న సిబ్బంది

కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు

- ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందుకు ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శనివారం ఎస్పీ రూపేశ్‌తో కలిసి ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎవరైనా ఇతరులపై వ్యక్తిగత దూషణలుకానీ, మతవిద్వేశాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేసినా, ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలను అరికట్టేందుకు సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా 1950తో కాల్ సెంటర్లును ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

పార్టీల ప్రచార పోస్టర్ల తొలగింపు

ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించగానే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఉన్న పార్టీల ప్రచార పోస్టర్లను తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్, పంచాయతీ సిబ్బంది చేపట్టారు. సంగారెడ్డి చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేశారు. కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ముఖ్యమంత్రి ఫొటోతో కూడిన ప్రచార ఫ్లెక్సీని తొలగించిన సిబ్బంది, కలెక్టరేట్‌లోనూ కిటికీలపై అతికించిన ముఖ్యమంత్రి ప్రచార పోస్టర్లను తొలగించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్తులపై ఎక్కడైనా వివిధ పార్టీల ప్రచార పోస్టర్లుంటే 24 గంటల్లోగా తొలగించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

- ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న మెదక్ ఆర్వో, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి16: పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ వివరాల నమోదు, కోడ్ ఉల్లంఘనపై తీసుకోవాల్సిన చర్యలపై ఏఆర్వో, ఏఈఆర్వో, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, అకౌంటింగ్ టీంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల పరిశీలక బృందాలు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున నగదు, ఇతర ఆభరణాలు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియోఫుటేజ్ తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నియామకం

ఈవీఎం మేనేజ్మెంట్ మోడల్ ఆఫీసర్‌గా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వేంకటేశ్వర్లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో ఎల్లయ్య, ట్రాన్స్‌పోర్టు మేనేజ్మెంట్ ఆఫీసర్‌గా డీఆర్వో పద్మశ్రీని నియమించారు. ట్రైనింగ్ నోడల్ అధికారిగా తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, బ్యాలెట్ పేపర్ పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిగా శ్రీనివాసరావు, కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారిగా సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ, శాంతిభద్రతల పరిరక్షణ నోడల్ అధికారిగా అదనపు ఎస్పీ మహేందర్, మ్యాన్ పవర్ అధికారిగా డీఈవో రాధాకిషన్, మెటీరియల్ అధికారిగా డీఎస్‌సీడీవో గోపాల్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ అధికారిగా మత్స్యశాఖ ఏడీ నరసింహారావును నియమించారు. స్వీప్ అధికారిగా బ్రహ్మాజీ, మీడియా అధికారిగా డీపీఆర్వో రామచంద్రరాజు, ఎలక్టోరల్ అధికారి డీఎఫ్‌వో రవిప్రసాద్, ఓటర్ హెల్ప్‌లైన్ (1950)అధికారిగా వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోవింద్ ఉంటారని, అబ్జర్వర్ అధికారి జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, పోలింగ్ వెల్ఫేర్ అధికారి డీపీవో యాదయ్య, పోలింగ్ కేంద్రాల మౌలిక సదుపాయల కల్పన అధికారిగా సర్దార్‌సింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అండ్‌బీ అధికారి విధులు నిర్వహిస్తారన్నారు.

రూ.5 కోట్ల విలువైన గంజాయి దహనం

- ఎనిమిది కేసుల్లో పట్టుబడిన 1,982 కిలోల గంజాయిని డిస్పోజల్ చేసిన పోలీసులు

సంగారెడ్డి క్రైం, మార్చి 16 : సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన ఎనిమిది కేసుల్లో నిందితుల నుంచి సీజ్‌చేసిన 1982 కిలోల గంజాయిని కోర్టు అనుమతితో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామ శివారులో దహనం చేశారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆధ్వర్యంలో దహనం చేసిన ఈ నిషేధిత గంజాయి విలువ దాదాపు రూ.5కోట్లు ఉంటుంది. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఎస్పీ రూపేష్, సభ్యులు అదనపు ఎస్పీ సంజీవరావు, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్యగౌడ్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బీ.రమేష్ ఆధ్వర్యంలో ఈ నిషేధిత గంజాయిని దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ కొందరు అక్రమార్జనలో భాగంగా గంజాయిని విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురిచేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం జిల్లావ్యాప్తంగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.



గంజాయిని దహనం చేస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేష్, పోలీసులు

రాజీమార్గమే రాజమార్గం

- లోక్ అదాలత్‌తో సమన్యాయం
- సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు
- జిల్లావ్యాప్తంగా 9 బెంచీలు.. 51వేల కేసుల పరిష్కారం
- మెదక్ జిల్లాలో పరిష్కారమైనవి 1,817 కేసులు

7

అర్హులైనా అందని జీరో బిల్లు

- ప్రజాపాలన కేంద్రాలకు విద్యుత్ వినియోగదారుల క్యూ



సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

సంగారెడ్డి రూరల్, మార్చి 16 : గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఇంటి యజమానితో పాటు అద్దెకుంటున్న వారికి కూడా ఉచిత విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే అర్హులైనా కొందరికి జీరో బిల్లు అందడడం లేదు. జిల్లాలో విద్యుత్ వినియోగదారులు మొత్తం 5,48,972 మంది ఉండగా ప్రజాపాలనలో 1,79,612 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 1,72,269 మందిని అర్హులుగా గుర్తించి ట్రాన్స్‌కో అధికారులు మార్చి నెలలో జీరో బిల్లులు జారీ చేయడం ప్రారంభించారు. లబ్ధిదారులకు జీరో బిల్లులు అందించగా వాటికి సంబంధించి రూ.4.96 కోట్లు ప్రభుత్వం భరించింది. గృహజ్యోతి పథకాన్ని అమలు చేసేందుకు వినియోగదారులు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారందరి ఇళ్లకు వెళ్లి విద్యుత్ సర్వీస్ నంబర్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు నంబర్, ప్రజాపాలన దరఖాస్తు వివరాలను సేకరించాలని గత ఫిబ్రవరి నెలలో విద్యుత్ శాఖాధికారులకు సర్కారు దిశానిర్దేశం చేసింది. కానీ విద్యుత్ శాఖ అధికారులు వివరాలు సేకరించేందుకు తమ ఇళ్లకు రాలేదని వినియోగదారులు వాపోయారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో వెళ్లి అడగగా ఇంటికే వస్తారని చెప్పడంతో ఇళ్ల వద్ద వేచిచూశామని, ఎవరూ రాలేదంటున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో తాము జీరో విద్యుత్ పథకానికి అనర్హులమయ్యామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 120, 133 యూనిట్లు వచ్చినా జీరో బిల్లు రాలేదని విద్యుత్ వినియోగదారులు వాపోయారు. మార్చి నెలలో వచ్చిన బిల్లు విద్యుత్ శాఖ అధికారులు కడతారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చేసిన తప్పిదానికి తాము (జీరో బిల్లు) గృహజ్యోతి పథకానికి దూరమయ్యామని అంటున్నారు. అయితే, విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేయడంతో, అర్హులైనా జీరో బిల్లులు రాని వారు తిరిగి ఆ కేంద్రాల్లో దరఖాస్తుకు క్యూ కడుతున్నారు. ఇప్పుడు ఇచ్చే దరఖాస్తులతోనైనా వచ్చే నెలలో జీరో బిల్లు వస్తుందో రాదోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

120 యూనిట్లే వినియోగించినా రూ.504 బిల్లు వచ్చింది



కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామన్నది. దానికి దరఖాస్తు కూడా చేసుకున్నాం. కానీ 120 యూనిట్లే వినియోగించినా జీరో బిల్లు రాకుండా రూ.504 బిల్లు వచ్చింది. కరెంటు బిల్లు కట్టాలని ఇంటికి వస్తున్నారు. ఉచిత విద్యుత్ ఎక్కడ అమలవుతోంది.

- వీరమణి, శివాజినగర్, సంగారెడ్డి

ఆన్‌లైన్ తప్పిదాలతో జీరో బిల్లు రాలేదు



సమయం తక్కువగా ఉండడం వల్ల ఇంటింటికీ తిరిగి సర్వే చేయలేకపోవచ్చు. ఆన్‌లైన్‌లో తప్పిదాల వల్లే అర్హులైనా కొందరికీ జీరో బిల్లులు రాలేదు. ప్రజాపాలన కేంద్రాల్లో తిరిగి దరఖాస్తు చేసుకుంటే జీరో బిల్లులు జారీ చేస్తాం.

- సురేందర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డీఈ



సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కార్యకర్తలు

భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

- ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా రోడ్డెక్కిన నేతలు
- రాస్తారోకోలు.. ర్యాలీలు
- ఆందోళనల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 16 : లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేయడంతో ఆ పార్టీ పిలుపు మేరకు శనివారం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆందోళనలు నిర్వహించారు. అన్నీ నియోజకవర్గ కేంద్రాల్లో, కొన్ని మండల కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద నాయకులు, కార్యకర్తలు నల్ల కండువాలను ధరించి రాస్తారోకో నిర్వహించారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు నాయకత్వంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అనీల్‌కుమార్ తదితరులు ప్రధాన రహదారిపై కొద్దిసేపు రాస్తారోకో చేపట్టారు. పటాన్‌చెరులో కార్పొరేటర్ కుమార్‌యాదవ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారిపై బైఠాయించారు. నారాయణఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. జోగిపేటలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి నాయకత్వంలో రాందాస్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఈడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతా రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు రహదారిపై బైఠాయించారు. సిద్దిపేటలో బీఆర్ఎస్ శ్రేణులు అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో చేపట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గజ్వేల్‌లో అంబేడ్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన ఆందోళనలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అక్బర్‌పేట - భూంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఆందోళనలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మెదక్‌లో చేపట్టిన నిరసనలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

తండ్రిని హతమార్చిన కొడుకు

- పాపన్నపేట మండల పరిధి రామతీర్థంలో ఘటన

7

ఐఐటీహెచ్‌లో అలరించిన 'ఎలాన్'

- నేటితో ముగియనున్న ఫెస్ట్

కుంటలో దూకి వ్యక్తి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, మార్చి 16: మద్యానికి బానిసైన యువకుడు కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నశంకరంపేట మండలం దర్పల్లికి చెందిన కొమ్ము వింటు(16) మద్యానికి బానిసయ్యాడు. గురువారం తల్లిదండ్రులతో గొడవపడగా మందలించారు. దీంతో మనస్తాపానికి గురై గ్రామ శివారులోని సాయమ్మకుంటలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

అక్రమంగా నీలగిరి చెట్ల నరికివేత



ప్లాంటేషన్‌లో పెద్దఎత్తున నరికిన నీలగిరి చెట్లు

శివ్వంపేట, మార్చి 16: ఓ వైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరిత హారం కార్యక్రమాన్ని చేపడుతుంటే... మరోవైపు అక్రమార్కులు అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. ప్లాంటేషన్‌లోని నీలగిరి చెట్లను నరికి అక్రమంగా పరిశ్రమలకు తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. మండల పరిధిలోని భీమ్లాతండాలో తూప్రాన్ రేంజ్ మంగళపర్తి సెక్షన్‌లో నీలగిరి ప్లాంటేషన్‌లో వందలాది చెట్లను నరికి వేస్తున్నారు. వారం రోజులుగా ప్లాంటేషన్‌లో రాత్రి సమయాల్లో చెట్లను నరికి పరిశ్రమలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు శుక్రవారం రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లి అక్రమంగా నరికిన కలపను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్వో మోహన్ తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు
- లోక్ అదాలత్‌లో 51వేల కేసుల పరిష్కారం
- మెదక్ జిల్లాలో 1817 కేసుల పరిష్కారం



సంగారెడ్డి క్రైం: భూసేకరణ నష్టపరిహారాన్ని బాధితులకు అందజేస్తున్న న్యాయాధికారులు



హుస్నాబాద్: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శివరంజని

సంగారెడ్డి క్రైం, మార్చి 16: రాజీమార్గమే రాజమార్గమని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి కే.ప్రభాకర్‌రావు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం ఆదా అవడంతో పాటు సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. సంగారెడ్డి జిల్లా కోర్టు హాల్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష్కారానికి అనువైన కేసులన్నీ లోక్ అదాలత్‌లలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీనిద్వారా కక్షిదారులకు సరైన పరిహారం కూడా సకాలంలో అందుతుందని చెప్పారు.

జిల్లావ్యాప్తంగా 9 బెంచీలు..

51వేల కేసుల పరిష్కారం

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో ఐదు బెంచీలు ఏర్పాటు చేశారు. జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట కోర్టులలో నాలుగు బెంచీలు ఏర్పాటు చేసి లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయా కోర్టులలో మొత్తం 51,078 కేసులు పరిష్కరించారు. ఇందులో క్రిమినల్ కాంపౌండ్ కేసులు 16,206, మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు 29, సివిల్ తగాదాలు 28, బ్యాంకు రికవరీ కేసులు 85, ప్రిలిటిగేషన్ కేసులు 34,002, ఎపిటిఎస్ ప్రిలిటిగేషన్ కేసులు 723, భూసేకరణ కేసులు 5 పరిష్కరించారు. పోతిరెడ్డిపల్లి హౌసింగ్ బోర్డుకు సంబంధించిన భూసేకరణ నష్టపరిహారాన్ని బాధితులకు అందజేశారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లను తెలంగాణ హైకోర్టు, లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.శ్యామ్, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త కార్యదర్శి జి.గోవర్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి జి.సుదర్శన్, న్యాయాధికారులు డా.పి.కృష్ణార్జున, సునీతారవీంద్రారెడ్డి, ఎం.లావణ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హన్మంతరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి లక్ష్మణ్ చారి, జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తేజశ్రీ, ఎస్పీ చెన్నూరి రూపేష్, అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో

288 కేసుల పరిష్కారం

హుస్నాబాద్, మార్చి 16: హుస్నాబాద్‌లోని మున్సిఫ్ కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 288 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో 105 కేసులు, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో 183 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శివరంజని అన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, పీపీ రవికుమార్, ఏజీపీ రామక్రిష్ణ పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో..

మెదక్‌అర్బన్/నర్సాపూర్, మార్చి 16: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1817 కేసులు పరిష్కారమయ్యాయని చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద తెలిపారు. కోర్టు ఆవరణలో అదాలత్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కోర్టులలో ఎన్నో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని, త్వరితగతిన పరిష్కరించి న్యాయం అందించడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కేసుల్లో రూ.1,42,38,409లను నష్టపరిహారం కింద అందించామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్‌చంద్ పాల్గొన్నారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకుని కేసుల నుంచి విముక్తి పొందవచ్చని నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కే.అనిత పేర్కొన్నారు. నర్సాపూర్ కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించారు.

అక్రమ కేసులు.. ఆస్తుల విధ్వంసంతో అడ్డుకోలేరు

- ఎన్నికల సమసయంలోనే రాజకీయాలు
- ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత కక్షలకు తావులేదు
- మాదారంలో బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే



రెవెన్యూ అధికారులు కూల్చివేసిన కట్టడాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం, మార్చి 16: తమ పార్టీలో చేరికల కోసం అక్రమ కేసులు, ఆస్తుల విధ్వంసంతో ఒత్తిళ్లకు గురిచేయటం కాంగ్రెస్‌కే చెల్లిందని, ఇలాంటి చర్యలతో తమను అడ్డుకోలేరని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జిన్నారం మండలం మాదారంలో రెవెన్యూ అధికారులు కూల్చివేసిన కట్టడాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పక్షపాతానికి పాల్పడలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యక్తిగత కక్షలకు దిగడం సరికాదన్నారు. నిరుపేదల ఆస్తుల విధ్వంసం, అక్రమ కేసులతో కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదన్నారు. మాదారంలో జీవనోపాధి కోసం పేదలు ఇళ్లను నిర్మించుకుంటే.. కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేసి కూల్చి వేయించడం బాధాకరమని పేర్కొన్నారు. నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని, వారికి ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. పోరాటాల చరిత్ర గల బీఆర్‌ఎస్‌కు కేసులు, జైళ్లు కొత్త కాదని కాంగ్రెస్ అరాచకాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని ఎమ్మెల్యే అన్నారు. నివాసాలు కోల్పోయిన బాధితులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీటీసీ వెంకటేశం గౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

తండ్రిని హతమార్చిన కొడుకు

- నిత్యం తాగొచ్చి తల్లిని వేధిస్తుండడంతో ఘాతుకం
- వారం క్రితమే పోలీసులకు ఫిర్యాదు
- కౌన్సెలింగ్ ఇప్పించినా మారని తీరు
- వేధింపులు తాళలేక పథకం ప్రకారం ఉరేసి హత్య



ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం,



సంగం ప్రేమానందం(ఫైల్)

పాపన్నపేట, మార్చి 16: నిత్యం తాగొచ్చి తల్లిని వేధిస్తున్నాడని కన్న తండ్రిని కొడుకు హత్య చేశాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. స్థానికులు, ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగం ప్రేమానందం(45), సుగుణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె. పెద్ద కుమారుడు సందీప్ సిద్దిపేటలో డిగ్రీ, కూతురు సంపూర్ణ ఓ రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి, చిన్న కొడుకు ఏడో తరగతి చదువుతున్నారు. కాగా మద్యానికి బానిసైన ప్రేమానందం తరచూ భార్యను అనుమానిస్తూ వేధించడమే కాకుండా తీవ్రంగా కొట్టేవాడు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్ది చెప్పినా తీరు మారలేదు. ఈ క్రమంలో గత బుధవారం మళ్లీ గొడవ జరగ్గా.. భార్య సుగుణమ్మ, పెద్ద కుమారుడు సందీప్ కలిసి ప్రేమానందంను రోకలి బండతో నడవరాకుండా కొట్టి.. సుగుణమ్మ తల్లిగారి ఊరైన అల్లాదుర్గం మండల పరిధి రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లిపోయింది. శనివారం సందీప్ ఇంటికి వచ్చేసరికి తండ్రి ప్రేమానందం, తాత ప్రసాద్ మాట్లాడుకుంటున్నారు. అందరినీ బయటకు వెళ్లగొట్టిన సందీప్ లోపలి నుంచి తలుపులు పెట్టాడు. లేవలేని స్థితిలో ఉన్న తండ్రిని కరెంట్ హీటర్, ఇతర వస్తువులతో విచక్షణారహితంగా కొట్టాడు. దెబ్బలకు తాళలేక ప్రేమానందం అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు తీయమని చెప్పారు. వారి మాటను పట్టించుకోని సందీప్.. 'కొన ఊపిరితో ఉన్నాడు. కొద్దిగా ఆగండి, ప్రాణం పోయాక తలుపులు తీస్తా'నంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. కొద్దిసేపటి తర్వాత చున్నీతో ప్రేమానందంకు ఉరేసి చంపి బయటకు వచ్చాడు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. ఎస్‌ఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలిపారు. మెదక్ రూరల్ సీఐ కేశవులు, క్లూస్‌టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు కూడా నెల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు వివరించారు. కాగా వారంరోజుల క్రితమే మృతుడి వేధింపులు భరించలేక కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసి.. కౌన్సెలింగ్ ఇప్పించారు. అయినా అతనిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో సందీప్ ఈ దారుణానికి పాల్పడ్డాడని తెలిసింది. సందీప్ ఇటీవల పోలీసు ఉద్యోగానికి సిద్ధం కాగా.. కాస్తలో ఉద్యోగం చేజారింది.

పల్వంచలో వ్యక్తి అదృశ్యం



భూమయ్య (ఫైల్)

టేక్మాల్, మార్చి 16: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని పల్వంచ గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ మురళీ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్వంచ భూమయ్య(25) ఈనెల 14న సాయంత్రం 6.30 నిమిషాలకు టేక్మాల్‌లోని చర్చికి పోతున్నాని వెళ్లాడు. మరుసటి రోజు వ్యవసాయ పొలం వద్ద బైక్ కనిపించడంతో కొడుకు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భూమయ్య భార్య నీరజ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకుకేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఐఐటీహెచ్‌లో కొనసాగుతున్న 'ఎలాన్ ఎన్‌విజన్'

- నేటితో ముగియనున్న ఎలాన్ ఫెస్ట్



ఐఐటీహెచ్‌లో టార్గెట్ షూట్ గేమ్ ఆడుతున్న విద్యార్థులు



పోటీలను తిలకిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ మూర్తి, అధ్యాపక బృందం

కంది, మార్చి 16: సంగారెడ్డి జిల్లా కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్ వేడుకలు సీక్రెట్ ఆఫ్ వాలెన్రో థీమ్‌తో శుక్రవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సంవత్సరం ఎలాన్ ఎన్‌విజన్ దేశ నలుమూలల నుంచి వేలాదిమంది విద్యార్థులు సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ఫన్నీ ఫొటోస్ గేమ్, టార్గెట్ షూటర్, వాటర్ గన్స్ కాంపిటీషన్ పోటీలు అందరినీ అలరించాయి. ఈ పోటీలను ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో పాటు అధ్యాపక బృందం తిలకించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలంటే ఇలాంటి సాంకేతిక పోటీలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. నృత్యాంజలి, ప్రోషో-ఎబిసి, స్టీవ్, సాంకేతిక వర్క్‌షాప్‌ల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు వారివారి సామర్థ్యాన్ని వెలికితీస్తూ అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతీ సంవత్సరం మాదిరిగానే వెబ్ డిజైనింగ్, షార్క్ ట్యాంక్, క్విజ్ హబ్‌ల టాక్ షోలో పాల్గొనేందుకు విద్యార్థులు మక్కువ చూపారు. బ్రేక్‌ఫ్రీ సోలో, బ్రేక్‌ఫ్రీ గ్రూప్, ప్రస్టోఫిషల్, గజేంద్రవర్మ పాటలు, స్టాండప్ కాంపిటీషన్, క్యాంపస్ ఐడల్, స్టాండప్ ఆదివారం షుగర్ రాక్రెట్రీ, డ్రోన్ ఛాలెంజ్, ఎక్స్‌ప్లోజర్, ఆర్ట్‌ఎటాక్, జనరల్ క్విజ్, స్పోర్ట్స్ క్విజ్, ఎగ్మా, ఇ-చేస్ మేనేజ్‌మెంట్, షార్క్ ట్యాంక్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ వర్క్‌షాప్, ఎథికల్ హ్యాకింగ్ అండ్ సైబర్ క్రైం, డీప్ లెర్నింగ్ వర్క్‌షాప్, డాటా సైన్స్ విత్ పైథాన్ వర్క్‌షాప్, వెబ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, గ్లిట్జ్ గ్లామర్, యునిబాల్ సీజన్, ప్రోషో డీజేషాన్, నాట్యాక్రం, ఆక్టీవ్, డీజే వార్స్ హనీవెల్ సెమినార్స్, ఈఎమ్‌ఎల్ టాక్‌షో, గ్రీన్‌కో సెమినార్, పిల్మ్‌ఫేర్ ఫియస్టా ప్రొజెక్షన్స్ విభాగాల్లో పోటీ జరగనున్నాయని అధికారులు వెల్లడించారు.

చినుకుపడితే చీకటే..!

- మెదక్‌లో రెండు గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

మెదక్ అర్బన్, మార్చి 16: చిన్నపాటి వర్షం.. వీచివీయని గాలులకే మెదక్ జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిపోతుంది. విద్యుత్ వ్యవస్థలో ఏదో ఒక అంతరాయం ఏర్పడటంతో పట్టణవాసులు గంటల కొద్దీ చీకటిలో మగ్గాల్సి వస్తున్నది. శనివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి సాయంత్రం 6:30 నుంచి 8:35 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామాయంపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షం..

రామాయంపేట, మార్చి 16: రామాయంపేట పట్టణంలో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అలాగే గాలులకు పట్టణంలోని టీస్టాల్ షెడ్లు ఎగిరిపడగా, పలుచోట్ల చెట్లు విరిగాయి.

ఖేడ్‌లో మోస్తారు వర్షం

నారాయణఖేడ్, మార్చి 16: ఖేడ్ పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున దాదాపు అరగంటపాటు మోస్తారు వర్షం కురిసింది. కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండల కారణంగా చల్లబడటంతో జనాలు ఉపశమనం పొందారు.

పంట కోతల ప్రయోగంతోనే దిగుబడుల అంచనా



ఔరంగాబాద్‌తండాలో పంట కోతల ప్రయోగాన్ని పరిశీలిస్తున్న బద్రినాథ్

హవేళిఘణపూర్, మార్చి 16: పంట కోతల ప్రయోగం ద్వారానే పంటల దిగుబడిని తెలుసుకోవచ్చని జిల్లా గణాంక శాఖాధికారి బద్రినాథ్ తెలిపారు. శనివారం మండలంలోని ఔరంగాబాద్ తండాలోని సర్వే నంబర్ 72లో రైతు కేతావత్ రాజు మొక్కజొన్న పంట పొలంలో పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5బై5 మీటర్ల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగుచేయగా.. 11,926 కిలో గ్రాముల దిగుబడి వచ్చిందన్నారు. ఈ దిగుబడుల ఆధారంగా జిల్లా, రాష్ట్ర దిగుబడులను అంచనా వేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఉప గణాంకాధికారి వెంకటేష్, సహాయక అధికారి సురేష్, మండల గణాంకాధికారిణి భార్గవి, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ బియ్యం డెలివరీ వేగవంతం చేయాలి

- టెండర్లు పూర్తయిన యాసంగి ధాన్యం వెంటనే అప్పగించాలి
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ కమిషనర్ చౌహాన్, హాజరైన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు

మెదక్, మార్చి 16: మిల్లర్లు సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేసి వానాకాలం బియ్యం అప్పగించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ అదనపు కలెక్టర్, పౌరసరఫరాల అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ డెలివరీ, రబీ 2022-23 సీజన్‌కు టెండర్ అయిన ధాన్యం మిల్లర్లకు అప్పగించడంపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరికృష్ణ, అధికారులతో కలెక్టరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలోని మిల్లర్లు డెలివరీ పూర్తిచేసి రాష్ట్రంలో మెదక్ జిల్లాను ముందు వరుసలో నిలపాలని సూచించారు. సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ ఆశచూపి మోసగించిన వ్యక్తి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

తూప్రాన్, మార్చి 16: తూప్రాన్ పట్టణంలో అధిక వడ్డీ ఆశచూపి వసూళ్లు చేసుకొని పరారైన వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి తెలిపారు. తూప్రాన్ పట్టణానికి చెందిన బిజిలిపురం యాదగిరి(37) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ చిట్టీల వ్యాపారం నిర్వహిస్తుండేవాడు. చిట్టీలు వేసిన వ్యక్తులకు అధిక వడ్డీ ఆశచూపి సొంతానికి వాడుకున్నాడు. అలాగే బ్యాంకు రుణాలు ఇప్పిస్తూ ఆ డబ్బులను అధిక వడ్డీ ఆశచూపి వాడుకున్నాడు. డబ్బులిచ్చిన వ్యక్తులు అడుగుతుండటంతో ఈనెల 4న భార్యా పిల్లలతో పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యాదగిరిని పట్టుకుని విచారించగా రూ.2.46 కోట్లు మోసం చేసినట్లు ఒప్పుకున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. తూప్రాన్ సీఐ రెడ్డబోయిన కృష్ణ, ఎస్‌ఐ శివానందం ఉన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ..

రోడ్డెక్కిన బీఆర్ఎస్ శ్రేణులు


జోగిపేట: రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి, బీఆర్ఎస్ నాయకులు


పటాన్‌చెరు: జాతీయ రహదారిపై కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు


జహీరాబాద్: పట్టణంలో రహదారిపై బైఠాయించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ నాయకులు


నర్సాపూర్‌లో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం


చేగుంటలో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

ఎమ్మెల్సీ కవితను అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు శనివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పార్టీ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలను చేపట్టాయి. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీసేందుకే కక్షపూరితంగా అరెస్టు చేశారని విమర్శిస్తూ ప్రధాన రహదారులపై బైఠాయించి ధర్నా, రాస్తారోకోలు చేశారు. బీజేపీకి, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మల దహనాలు చేపట్టారు. పలుచోట్ల రాకపోకలు స్తంభించడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

సంగారెడ్డి రూరల్, మార్చి 16 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీసేందుకు ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో బీఆర్ఎస్ నేతలు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత కేసు సుప్రీం కోర్టులో విచారణలో ఉండగా ఈడీ అధికారులు అరెస్టు చేయడం అమానుషమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజయేందర్‌రెడ్డి, నరహరిరెడ్డి, జలేందర్‌రావు, కొండల్‌రెడ్డి, బీరయ్యయాదవ్, మ్యాకం విఠల్, మల్లాగౌడ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **జోగిపేట:** జోగిపేటలో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటలో ఆందోళన చేపట్టాయి. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు వెలువడే ముందు నాటకీయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయించిందని క్రాంతికిరణ్ విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జోగిపేటలోని స్థానిక హనుమాన్ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించి ప్ల కార్డులు ప్రదర్శిస్తూ, మోదీ, ఈడీ లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అధ్యక్షుడు జోగు బాలయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్లు డీబీ నాగభూషణం, పల్లె సంజీవయ్య మాజీ ఎంపీపీ అధ్యక్షుడు హెచ్. రామాగౌడ్, వీరప్ప, లింగాగౌడ్, చాపల వెంకటేశం, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **పటాన్‌చెరు:** రాజకీయ కక్షతోనే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు శనివారం పటాన్‌చెరు జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించాయి. కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రహదారిపై బైఠాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ జాం అయి వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు బలవంతంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను, నాయకులను రోడ్డుపైనుంచి తొలగించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనలో కార్పొరేటర్ పుష్పానగేష్, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ ఈర్లదేవానంద్, మున్సిపల్ వైస్ చైర్మెన్ నర్సింహగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితమైన రాజకీయాలు చేస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే మాణిక్‌రావు నేతృత్వంలో ప్రధాన రహదారిపై ర్యాలీ, ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్ మశ్చందర్, బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ అర్బన్, మార్చి16: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు బీజేపీ, కాంగ్రెస్ కుట్ర అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టును వ్యతిరేకిస్తూ.. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మెదక్, హవేళీఘణపూర్, రామాయంపేట పార్టీ మండలాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● **నర్సాపూర్:** బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవితను కుట్రలో భాగంగానే అరెస్టు చేశారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను రాజకీయంగా దెబ్బతీయలేరన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, జడ్పీటీసీలు బబియానాయక్, జడ్పీకోఆప్షన్ మన్సూర్, మేఘమాల, కవితాఅమర్‌సింగ్, ఆంజనేయులు, రమేష్‌గౌడ్, ఎంపీపీలు రాజు, మంజులకాశీనాథ్, హరికృష్ణ, నర్సింహులు, మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **చేగుంట:** కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ చేగుంట గాంధీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మోదం శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు, నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత అరెస్టును తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీటీసీ నవీన్, వడేపల్లి నర్సింలు, జింక శ్రీనివాస్, రాజ్ గోపాల్, ఎర్ర యాదగిరి, అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌సిలిండర్ పేలుడులో గాయపడిన ఇద్దరి మృతి


లక్ష్మయ్య(ఫైల్)


కీర్తి(ఫైల్)

జహీరాబాద్, మార్చి 16: ఈ నెల 10వ తేదీన పట్టణంలోని మాణిక్ ప్రభు మహేళాలో సిలిండర్ పేలి గాయాలకు గురైన ఎరుకల లక్ష్మయ్య(68), ఎరుకల కీర్తి(4) హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న మాణిక్ ప్రభు మహేళాకు చెందిన ఎరుకల లక్ష్మయ్య కోడిగుడ్లను ఉడికిస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి సిలిండర్ పేలింది. ఈ ఘటనలో లక్ష్మయ్యతో పాటు అక్కడే ఉన్న మనవరాలు ఎరుకల స్వాతికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఎరుకల లక్ష్మయ్య శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శనివారం ఉదయం కీర్తి మృతి చెందిందని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యురాలు ఎరుకల జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

బైక్ చోరీకి యత్నం.. నిందితుడికి దేహశుద్ధి

తూప్రాన్, మార్చి 16: పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసేందుకు యత్నించి ఓ యువకుడికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో శనివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఏపీ రాష్ట్రంలోని కావలికి చెందిన అనీల్ తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద జ్యూస్ స్టాల్ నిర్వహిస్తున్నాడు. తన జ్యూస్ స్టాల్ వద్ద పార్కింగ్ చేసేందుకు స్థలం లేకపోవడంతో ఎదురుగా కల్లు దుకాణం సమీపంలో అనీల్ బైక్‌ను పార్కు చేశాడు. ఉదయం నుంచి ఆ బైక్ వద్దే తచ్చాడుతున్న ఓ యువకుడు బైక్ కోసం ఎవరూ రాకపోవడంతో ఆ బైక్ తనదంటూ అక్కడున్నోళ్లకు చెప్పాడు. బైక్ తాళంచెవి పోయిందని నమ్మించి లాక్ విరగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. అదే సమయంలో బైక్ యజమాని అనీల్ అక్కడకు రాగా, బైక్ తనదే అంటూ నిందితుడు అనీల్‌ను దబాయించే ప్రయత్నం చేయడంతో దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం స్థానికులు దేహశుద్ధి చేసి ప్రశ్నించగా తాను నర్సాపూర్‌కు చెందిన రమేశ్‌గా ఆ యువకుడు చెప్పాడు. ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. బైక్ చోరీకి ప్రయత్నించిన యువకుడిని స్థానికులు పోలీసులకు అప్పగించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

టేక్మాల్, మార్చి16: వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలని, ప్రయాణ సమయాల్లో వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని రోడ్డు రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ వాహనదారులకు తెలిపారు. శనివారం టేక్మాల్ చౌరస్తాలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబరు ప్లేట్, సరైన పత్రాలు లేని వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నామన్నారు.

సహనానికి చిరునామా మహిళలు: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, మార్చి 16: సహనానికి చిరునామా మహిళ అని, సమాజంలో మహిళ స్థానం చాలా గొప్పదని డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని గాంధీ సెంచనరీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీపీటీఎఫ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ సమాజంలో విద్యా విలువలు నేర్పించేది మహిళలేనని, మంచి సమాజాన్ని నిర్మించేందుకు మహిళా టీచర్లు చాలా అవసరమన్నారు. అనంతరం ప్రముఖ డాక్టర్ విజయలక్ష్మి, సైకాలజిస్ట్ శైలజవిస్సమ్ శెట్టి, పేరెంటింగ్ కోచ్ విజయలక్ష్మి మాట్లాడారు. సదస్సులో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు లక్ష్మయ్యయాదవ్, సోమశేఖర్, సునీతాఖన్నా, ఉపాధ్యక్షులు నాసర్‌పటేల్, విజయ్‌భాస్కర్, జిల్లా కార్యదర్శులు భవాని, మల్లికార్జున్, పుండరీకం, నర్సింహులు, మహిళా టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా డ్రగ్స్ భూతాన్ని తరిమేద్దాం: ఎస్ఎఫ్ఐ

సంగారెడ్డి రూరల్, మార్చి 16: నిండు జీవితాలను కబలించే డ్రగ్స్ భూతాన్ని కలిసికట్టుగా తరిమేద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు మాణిక్యం అన్నారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలో ఓ ప్రైవేటు కళాశాలలో శనివారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉందని అలాంటి యువత మంచి మార్గంలో పయనించి పది మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, రవికాంత్‌గౌడ్, వాణి, కార్తీక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంట మండలంలో కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే

చేగుంట, మార్చి 16: మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోతున్న పంటలకు కాలువల ద్వారా నీరు అందించాలని, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. చేగుంట మండలం రాంపూర్, గొల్లపల్లి, గ్రామాల్లో కెనాల్ కాలువలను శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే కు పలు గ్రామాల రైతులు తమ పంటలకు కాలువల ద్వారా నీరు అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మక్కరాజిపెట్ గ్రామ పంచాయితీ పరిధిలోని రాయిన్ చెరువు, తండాలోని జగదాంబ అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు పూజలు చేశారు. ఆయన వెంట రాష్ట్ర యువజన నాయకులు సోలిపేట సతీష్ రెడ్డి, జడ్పీటీసీ మొదం శ్రీనివాస్, ఇబ్రహీంపూర్ సొసైటీ వైస్ చైర్మన్ తానూష తదితరులున్నారు.

నాయకుడికి సేవాభావం ఉండాలి

జహీరాబాద్, మార్చి 16: ప్రజలకు సేవ చేసే భావన నాయకుడికి ఉండాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో రూ.1.04 కోట్ల వ్యయంతో 20 దుకాణాల సముదాయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన వాటిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణ సముదాయాలతో వ్యాపారులకు ప్రయోజనం చేకూరనుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మార్కెట్‌కమిటీ చైర్మన్ సాయిచరణ్, పీఏసీఎస్ చైర్మన్ మశ్చందర్, నాయకులు నారాయణ, నర్సింహులు, నర్సింహారెడ్డి, హుగ్గెల్లి రాములు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన రాచన్నస్వామి జాతర


స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు

కోహీర్, మార్చి 16: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల శ్రీరాచన్న స్వామి ఆలయంలో గత మూడు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు శనివారం స్వామివారి కల్యాణంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజైన శనివారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన అన్న పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.30గంటలకు శ్రీ భద్రకాళిదేవి సహిత శ్రీ రాచన్నస్వామికి ఎంతో వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అలాగే వైభవంగా రథోత్సవం నిర్వహించగా, భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొని పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటల సమయంలో నిర్వహించిన స్వామి వారి రథోత్సవం కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పాల్గొన్నారు.

అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమం

● **సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు**

సంగారెడ్డి రూరల్, మార్చి 16 : అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చుక్క నర్సయ్య 10వ వర్ధంతి సందర్భంగా శనివారం. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భూమికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ప్రభావంతో భూస్వామ్య వ్యవస్థ అంతమొందించేందుకు వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. అమరుల ఆశయ సాధన కోసం బలమైన ప్రజా పోరాటాలు నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిపే పోరాటాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని కేంద్రానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి కార్యకర్తలే బలం.. బలగం

జహీరాబాద్ ఎంపీ, అభ్యర్థి బీబీపాటిల్


ఖేడ్‌లో బీజేపీ క్రియాశీల కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్

నారాయణఖేడ్, మార్చి 16: బీజేపీకి కార్యకర్తలే బలం.. బలగం అని, కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ పేర్కొన్నారు. శనివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. మోదీ దేశాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. పేదరిక నిర్మూలన కోసం మోదీ కృషిని చూసి తాను బీజేపీలో చేరానన్నారు. మరోసారి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల బీజేపీ అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, అరుణతార, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి, అభిషేక్ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు విజయపాల్‌రెడ్డి, ఎండల లక్ష్మీనారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, అనంత్‌రావు కులకర్ణి, రవికుమార్, నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, మండలాల నాయకులు పాల్గొన్నారు.

పలువురి చేరిక

● **నాగల్‌గిద్ద:** బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో శనివారం మండల పరిధిలోని మోర్గి, శాపూర్, గొందెగాం తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు నందుపటేల్, రవీందర్‌తో పాటు పలువురు వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీబీపాటిల్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, నాయకులు మారుతిరెడ్డి, రామకృష్ణ, రాజశేఖర్‌పటేల్, శర్ణప్ప ఉన్నారు.

● **పెద్దశంకరంపేట:** భారతీయ జనతా పార్టీతోనే సుస్థిర దేశాభివృద్ధి సాధ్యమౌతుందని జహీరాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి,ఎంపీ బీబీపాటిల్‌అన్నారు. శనివారం జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ సమక్షంలో మండలం బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొట్టిముక్కల, మాడ్వేట్‌పల్లి, లక్ష్మాపూర్, ఇసుకపాయల తండా, కట్టెల వెంకటాపూర్ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, పలువురు నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీబీబీపాటిల్ మాట్లాడుతూ.. గ్రామాల్లో బూత్‌స్థాయి వరకు కార్యకర్తలు, నాయకులు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే సంజీవరెడ్డి


పెద్దశంకరంపేటలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దశంకరంపేట, మార్చి 16: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దశంకరంపేట మండలపరిధిలోని కోలపల్లి, మాడ్వేట్‌పల్లి, పెద్దశంకరంపేటలోని పలు వీధుల్లో సీసీ రోడ్డు నిర్మాణాలకు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయిని మధు, మాజీ జడ్పీటీసీ ఇందిరా సురేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **నాగల్‌గిద్ద:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఖేడ్ ఎమ్మెల్యేపట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వల్లూర్, శాపూర్, గొందెగాం, నాగల్‌గిద్దలలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం స్థానిక నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, నాయకులు గుండేరావుపటేల్, అనిల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** విద్యుత్ షాక్‌తో మూగ జీవాలు మృతి చెందగా, 16 మంది బాధితులకు ఒక్కొక్కరికి విద్యుత్ శాఖ ద్వారా రూ.40 వేల చొప్పున శనివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిహారం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఇంజనీర్ సురేష్, మాజీ ఎంపీ రాంచందర్, మాజీ సర్పంచు రాములునాయక్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించేందుకే పోషణ్ పక్వాడ


కోహీర్: కవేలి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


మాసాయిపేటలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్నఅంగన్‌వాడీ సిబ్బంది, ఆయాలు

సంగారెడ్డి రూరల్, మార్చి 16 : ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందించేందుకే పోషణ్ పక్వాడ పక్షోత్సవాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ సౌమ్య తెలిపారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు జిల్లాలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్‌పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమతుల ఆహారం అందించి రక్తహీనతను నివారించడమే పోషణ్ పక్వాడ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ సమన్వయకర్త నవీన్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **కోహీర్:** అంగన్‌వాడీ టీచర్లు గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారాలపైన అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో సునీతాబాయి పేర్కొన్నారు. శనివారం కోహీర్ మండలంలోని కవేలి గ్రామంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లి, బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి, అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు ఉన్నారు.

● **మునిపల్లి:** మండలంలోని చిన్నచెల్మడ అంగన్‌వాడీ టీచర్ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ మీనాక్షి ఆధ్వర్యంలో గ్రామంలోని గర్భిణులకు సీమంతాలు, కిశోర బాలికలకు అన్నప్రసన్న తదితర కార్యక్రమాలు నిర్వహించి, కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ శైలజ, అంగన్‌వాడీ టీచర్ మీనాక్షితో పాటు ఆశావర్కర్లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

● **చిన్నశంకరంపేట:** మండలంలోని భాగిర్థిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి మాట్లాడుతూ.. పోషక విలువలు గల ఆకు కూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, తినాలన్నారు. చిన్నారులకు ముర్రు పాలు తాగించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషణ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎమ్, అంగన్వాడి కార్యకర్త వరలక్ష్మి, ఆశావర్కర్లు ఉన్నారు.

● **మాసాయిపేట:** మండల కేంద్రమైన మాసాయిపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ఐదుగురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, చీర సారెలను అందజేశారు. అనంతరం ఐదుగురు చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించి గర్భిణులకు సీమంతం వేడుకలను జరిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల సూపర్‌వైజర్ మాధవిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సిబ్బంది, విద్యార్థులు, గర్భిణులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

● **రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆర్డీవో**

నర్సాపూర్, మార్చి 16: పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వచ్చినందున కోడ్ ఉల్లంఘించకుండా నిబంధనల మేరకు ఆయా రాజకీయ పార్టీలు నడుచుకోవాలని నర్సాపూర్ ఆర్డీవో జయప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ప్రకారం ఆయా పార్టీలు పనిచేయాలన్నారు. అదేవిధంగా ఆయా ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న రాజకీయ పార్టీల నాయకులకు సంబంధించిన చిత్రపటాలు, ఫొటోలు, ప్రకటనలకు సంబంధించినవి తీసివేయాలని సూచించారు. అదేవిధంగా విగ్రహాలకు ముసుగువేయడంతో పాటు ఫ్లెక్సీలు, పెయింటింగ్స్ కూడా గోడలపై ఉండకుండా చూడాలన్నారు. రాజకీయ పార్టీల సమావేశాలకు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నుంచి ఉదయ్‌కుమార్, బీజేపీ నుంచి నాగరాజు, సీపీఐనుంచి కాలేక్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు

నెల పాటు పశువులకు వ్యాక్సిన్లు


బీరంగూడ గోశాలలో ఆవును పరీక్షిస్తున్న వసంతకుమారి

పటాన్‌చెరు, మార్చి 16: పశువుల్లో ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి నివారణకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వసంతకుమారి చెప్పారు. శనివారం బీరంగూడ భ్రమరాంబమల్లిఖార్జున గోశాలలో పశువులను పరీక్షించి గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్లు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వచ్చే నెల 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు ఇస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,67,455 గోజాతి పశువులు ఉన్నాయన్నారు. నెలరోజుల్లో వ్యాక్సిన్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు 72బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రాజేశ్వరావు, కిష్టారెడ్డిపేట పశువైద్యులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ చైతన్య, సిబ్బంది సుఖేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'సాహితి' ఉచిత వైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో మహిళకు ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

సంగారెడ్డి అర్బన్, మార్చి 16: సంగారెడ్డి పట్టణం రైతు బజార్ ముందున్న సాహితీ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన ఉచిత న్యూరో, డయాబెటిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. న్యూరో డాక్టర్ బీఎస్ రెడ్డి, జనరల్ ఫిజిషియన్ డా.వి.శ్రీనివాస్ రోగులకు వైద్య సేవలందించారు. ఉచిత హెల్త్ క్యాంపు ద్వారా 320 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించామని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ సాహితీ రాము తెలిపారు. కాగా న్యూరో డాక్టర్ ఆస్పత్రిలో 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

పాపన్నపేట తైబజార్‌కు రూ.4లక్షలకు పైనే వేలం

పాపన్నపేట, మార్చి 16: పాపన్నపేట గ్రామపంచాయతీకి తైబజారు వేలం పాట ద్వారా రూ.4లక్షల 23వేల ఆదాయం సమకూరినట్లు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి, కార్యదర్శి నయీం వెల్లడించారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాయంలో తై బజారు వేలం పాటలు నిర్వహించగా తాత్కాలిక దుకాణాలు, వాహనాల రుసుము వసూలు చేసుకునేందుకు గాను వేలంలో జకీర్ రూ.4లక్షల 23వేల అధికంగా పాడి కైవసం చేసుకున్నాడు. గింజల మార్కెట్ నిర్వహణ కోసం వేలం నిర్వహించగా సరైన ధర పలకనందున వేలం పాటను రద్దు చేశారు. గింజల వేలం పాటను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు గౌస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మంబోజిపల్లిలో తైబజార్ వేలం

మెదక్ అర్బన్, మార్చి16: మెదక్ మండలంలోని మంబోజిపల్లి గ్రామ పంచాయతీలో శనివారం తైబజార్ వేలంపాట నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జంగం నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో మేకల కృష్ణ అనే వ్యాపారి రూ.3.40 లక్షలకు వేలం పాడి తైబజార్ దక్కించుకున్నాడు.

ధర్మారంలో పులి కలకలం

రామాయంపేట, మార్చి 16: మండలంలోని ధర్మారం గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. శుక్రవారం రాత్రి సమయంలో మెట్టు గోడల వద్ద దేవరాజ్ అనే యువకుడికి పులి కనిపించింది. అయితే అతడు పులిని చూసిన విషయాన్ని గ్రామ కమిటీ వాట్సాప్ గ్రూపుల్లో పెట్టి రైతులను అప్రమత్తం చేశాడు. పులి సంచరిస్తున్న విషయం తెల్చుకున్న ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు పులిని పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ నెల 18 నుంచి ఓపెన్ స్కూల్ ఫీజు చెల్లింపు

సంగారెడ్డి అర్బన్, మార్చి 16: ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ పొందిన పదో తరగతి, ఇంటర్మీడియట్ అభ్యాసకులు తత్కాల్ స్కీమ్ ద్వారా ఈ నెల 18నుంచి 21 వ తేదీ వరకు పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవ, టీ-ఎస్ ఆన్‌లైన్ కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు కో ఆర్డినేటర్ 8008403635 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

వట్‌పల్లి, మార్చి 16: మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీ పథకాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో డీపీఎం మల్లేశం పేర్కొన్నారు.శనివారం వట్‌పల్లి మండల సమైక్య కార్యాలయంలో బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, అమ్మ ఆదర్శ పాటశాలలు, తదితర అంశాలపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్ సీసీలు ఈశ్వరయ్య, మల్లేశం, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ల ఎన్నిక

చిన్నశంకరంపేట, మార్చి 16: చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, చందంపేట గ్రామ హైస్కూల్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లుగా మహిళా సామాఖ్య సభ్యురాలు శ్రవంతి, విలేజ్ ఆర్గనైజర్ దుర్గం లలిత శనివారం ఎన్నికయ్యారు. కన్వీనర్లుగా ప్రిన్సిపాల్ శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నారు. పలువురిని కమిటీ సభ్యులను నియమించారు.

● **చేగుంట:** మండలంలోని వడియారం ప్రాథమిక పాఠశాల శనివారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా కాసులాబాద్ సిద్ధమ్మ, కన్వీనర్‌గా నవాత్ సురేష్ ఎన్నికయ్యారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రతీ తరగతిలో ముగ్గురు చొప్పున 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

● **నిజాంపేట:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చైర్ పర్సన్‌గా చింతకాయల శ్వేత, కన్వీనర్ గొడిశాల ప్రభాకర్, అలాగే కమిటీ సభ్యులుగా 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

అజ్జమర్రిలో అభివృద్ధి పనులు

చిలప్‌చెడ్, మార్చి 16: మండలంలోని అజ్జమర్రిలో శనివారం పలు అభివృద్ధి పనులను ఎంపీపీ వినోద ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామం లో రూ.9 లక్షలతో సిసి రోడ్లు, జడ్పీ నిధులతో మురుగు కాలువల నిర్మాణం పనులను ప్రారంభించినట్లు చెప్పారు.